క్లుప్తంగా

ఆశీల వసూళ్లకు 29న వేలం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో వివిధ ఆశీళ్ల వసూళ్ల హక్కు కోసం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు కార్య నిర్వాహణాధికారి కె.వినోద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించి రోజువారి మార్కెట్ ఆశీళ్లకు సంబంధించి రూ. ఒకలక్ష , వారపు సంతకు రూ. పది వేలు, బస్సు, కారు స్టాండుకు రూ. 20 వేలు, కమేళాకు రూ. పది వేలు నిర్ణీత ధరావతు చెల్లించి పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మంచినీటి సరఫరాకు ప్రాధాన్యత

● ఎమ్మెల్సీ రామారావు



బోర్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ రామారావు, సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు

కవిటి: మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. సహలాలపుట్టుగ పంచాయతీలో విద్యుత్ మోటార్‌తో నడిచే మూడు బోర్లను ఆదివారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధుల నుంచి ఒక్కో బోరుకు రూ.2 లక్షలు కేటాయించి వీటిని ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ తెలిపారు. అనంతరం గ్రామస్తుల వితరణతో సత్తెమ్మ అమ్మవారి ఆలయం మండపం నిర్మాణానికి ఎమ్మెల్సీ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, నాయకులు ఇప్పిలి కృష్ణారావు, జగన్, జి.భగవాన్‌ప్రదాన్, రవి, బడ్డాయి మురళి, దట్టి అజయ్, కర్రి పొట్టెయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

మందస: మఖరజోల గ్రామానికి చెందిన గుంట దేవేంద్రరావు అక్కుపల్లి పశు చికిత్స కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆదివారం హోన్నాళి గ్రామానికి వెళ్లేందుకు బాలిగాం అండర్‌పాసేజ్ నుంచి జాతీయ రహదారికి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు దేవేంద్రరావుపై దాడి చేసి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీనిపై మందస పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న వసంతరెడ్డి

సంతబొమ్మాళి: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి అన్నారు. పాతలింగూడు పంచాయతీ ఎం.సున్నాపల్లి గ్రామంలో భూలోక మాత గ్రామదేవత సంబర మహోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంటు పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. 40 జట్లు తలపడనున్నట్టు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు నక్క చింతామణి, స్థానిక సర్పంచ్ టి.నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క భీమారావు, ఎం.అప్పారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, జీరు బాబూరావు, శ్రీరంగం వీరాస్వామి, చింతల రాజులు పాల్గొన్నారు.

పలాస విద్యుత్‌శాఖ ఏఈగా వివేకానంద



వివేకానంద

కాశీబుగ్గ: పలాస విద్యుత్‌శాఖ మండల ఏఈగా సిగలపల్లి వివేకానంద నియమితులయ్యారు. ఇప్పటి వరకు టెక్కలి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాయంలో పని చేసిన ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏడాదిగా ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మందస ఏఈ యోగి ఇప్పటివరకు ఇన్‌చార్జిగా వ్యవహరించేవారు.

ఒకటిన ఉత్కళ ఆవిర్భావ దినోత్సవం

కాశీబుగ్గ: ఏప్రిల్ ఒకటో తేదీన కాశీబుగ్గ బృందావన చంద్ర ఆలయంలో ఉత్కళ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక సమావేశం ఉంటుందని సంఘ అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్న ఒడియా బ్రాహ్మణులంతా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

● జ్ఞాపకాల ఒ(బ)డిలో..



నాలుగున్నర దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందంతో గడిపారు. అప్పటి తరగతి గదులను తరివితీరా చూసుకుని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దీనికి సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. 1977-78 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులంతా ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువు నేర్పిన గురువులైన రామారావు, రాజా, భత్సవత్సలం మాస్టార్లను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గురుశిష్యుల బంధం ఎంతో గొప్పదన్నారు. పూర్వ విద్యార్థులు పిలక రాజశేఖర్‌రెడ్డి, చిక్కాల శివప్రసాద్, అంబటి చంద్రశేఖర్, షేక్ హుమయున్ ఉన్నారు. -సంతబొమ్మాళి



వజ్రపుకొత్తూరు మండలం గోవిదపురం ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చదివిన బడి ఒడిలో నాటి తీపి గురుతులను నెమరు వేసుకున్నారు. అంతా ఒక చోట చేరి విందు భోజనాలు చేశారు. వినోద కార్యక్రమాలతో సందడి చేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. చదువు నేర్పిన గురువులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కొంచాడ శేఖర్, ఆర్.మాధవరావు, కె.నారాయణమూర్తి, పేరాడ యుగంధర్, దున్న రమేష్ పాల్గొన్నారు. - వజ్రపుకొత్తూరు

● ఆలయ పునఃప్రతిష్ట



కవిటి మండలంలోని ఆర్.బైరిపురం గ్రామంలో ఓంకార గణపతి, త్రిమూర్తుల ఆలయం పునఃప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. దాత బొర్ర శ్యామలరావు ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం గణపతి హోమం, విశేష పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉద్దానం సంగీత కళాకారుల గాత్రకచేరీ భక్తులను అలరించింది. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. -కవిటి

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ర్యాలీలో చైర్మన్ గిరిబాబు తదితరులు

● మొగిలిపాడులో ఆసరా వారోత్సవాలు

కాశీబుగ్గ: మహిళల సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధి మొగలిపాడు సచివాలయం పరిధిలో డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతం కృషి చేస్తున్నారన్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఇది మహిళల పక్షపాత ప్రభుత్వమన్నారు. ఆసరా డబ్బులను డ్వాక్రా సంఘ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దున్న నిర్మల, వార్డు ఇన్‌చార్జి సత్యం, మెప్మా టీఎంసీ బోర భాస్కరరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు: మండలానికి చెందిన యువతరం సేవా సమితి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పూండిలో ఆదివారం నిర్వంచిన మోగా రక్తదాన శిబిరానికి విశేష స్పదన లభించింది. 30 మంది యువకులు రక్తదానం చేయగా.. ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సహకరించారు. అలాగే శ్రీకాకుళం మెడికవర్ అస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలో గెలుపొందిన పూండికి చెందిన వివేకానంద, చినబడాం గ్రామానికి చెందిన సాయి శిరీష, హుకుంపేట ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే చిత్రలేఖనం, చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నివారణ సంస్థ గౌరవ కార్యదర్శి మంత్రి వెంకటస్వామి రక్తదానం, క్షయ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, సంస్థ అధ్యక్షుడు చింత మురళి, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రైతులకు లబ్ధి



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వ్యవసాయదారులకు సంతృప్తికరమైన సేవలందుతున్నాయని మండలాధ్యక్షుడు పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మకరాంపురంలోని రైతు భరోసా కేంద్రానికి చెందిన భూలోకమాత గ్రూప్ సభ్యులకు సీహెచ్‌సీ నిధులతో మంజూరైన ట్రాక్టర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ట్రాక్టర్ పూర్తి ధర రూ.8.53 లక్షలు కాగా దీనికి 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఆర్‌బీకే అధ్యక్షుడు లద్దు కేశవపాత్రో, స్థానిక నాయకులు ఎలుసూరి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు వజ్జ కృష్ణారావు, శమళ్ల రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న పిరియా విజయ, కృపారాణి

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట గ్రామంలో గల అభయాంజనేయ, పంచముఖ గణపతి, షిర్డీసాయి బాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహించిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయని తురకపేట సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చివరి రోజు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ కిలారి త్రినాథులు పాల్గొన్నారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తుల కోసం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

పుస్తకాలతోనే విజ్ఞానం సాధ్యం



ఎచ్చెర్ల: బహుమతులతో విద్యార్థులు

ఎచ్చెర్ల: పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం సాధ్యమని.. అలాగే మనసు ప్రశాంతంగా ఉంటుందని ధర్మవరం శాఖా గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. 'చదవటం మాకిష్టం' కార్యక్రమాన్ని గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొప్పవాళ్ల జీవిత చరిత్రలను చదివి వారి గురించి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించడం, వేమన శతకం, సుమతీ శతకం, నీతి కథలు, రామాయణం, భారతం వంటివి చదివించారు. కథలు చెప్పడంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఆర్.రోహిత్, సీహెచ్ వెంకీ, ఎం.దీపిక, ఎం.నవ్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, పాఠకులు సూరిబాబు, మహేష్, జగదీష్, సురేష్, మధు, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని లావేరు, మురపాక శాఖాగ్రంథాలయాల అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. రెండు గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు వేమన, సుమతీ శతకాలు చెప్పడంపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం చదవడం మాకిష్టం, చిల్డ్రన్స్ క్లబ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

సోంపేట: వివిధ కేసుల్లో పట్టుబడిన 22 ద్విచక్ర వాహనాలను సోంపేటలోని ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం పది గంటలకు వేలం వేయనున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ అధికారులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు వెయ్యి రూపాయలను ధరావతుగా చెల్లించాలని సూచించారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

టెక్కలి రూరల్: నర్సింగపల్లి గ్రామానికి చెందిన నిరుపేద ముద్ద కరువయ్య ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న రాంబాబు చారిటబుల్ ట్రస్టు తమవంతు సాయం చేసేందు ముందుకొచ్చింది. పది వేల రూపాయలను కరువయ్యకు ఆదివారం అందజేసినట్టు ట్రస్టు ప్రతినిధి ఎన్ని షణ్ముఖరావు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం సాయంత్రం పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఇచ్ఛాపురంలో ఐదు రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయం వద్ద వేచిఉన్న క్రయ, విక్రయదారులు

ఇచ్ఛాపురం: స్థానిక సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ఆదివారం రోజంతా పని చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం కొద్దిరోజుల్లో ముగిస్తున్న నేపథ్యంలో లక్ష్యాన్ని ఛేదించేందుకు వీలుగా కార్యాలయాన్ని తెరిచి ఉంచగా ఐదు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సబ్‌రిజిస్ట్రార్ కె.కమల తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు.

వైభవంగా రాజరాజేశ్వరి అమ్మవారి సంబరాలు



ఊరేగింపుగా వెళ్తున్న అమ్మవారి దాసుడుతోపాటు గ్రామస్తులు

కొత్తూరు: మండల కేంద్రంలో రాజరాజేశ్వరి (రాజ్యలక్ష్మి) సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులగా సంబరాలు నిర్వహిస్తున్నారు. చివర రోజు రాజరాజేశ్వరి అమ్మవారిని కొలుస్తున్న కొమనాపల్లి లక్ష్మి కుటుంబ సభ్యులు, దాసుడు, గ్రామస్తులు ముర్రాటలతోపాటు దైవమమ్మ చెట్టు వరకు ఊరేగింపుగా బయలు దేరారు. చెట్టు వద్ద మొక్కలు చెల్లించారు.

పట్టుబడిన దోపిడీ దొంగలు

● రూ.80 వేల నగదు, 15 గ్రాముల బంగారం రికవరీ



పోలీసుల అదుపులో నిందితులు, రికవరీ చేసిన సొత్తు

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన దోపిడీలకు సంబంధించి పోలీసులు ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్ట్ చేశారు. బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం... నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధిలోని 4 ప్రాంతాల్లో జరిగిన దోపిడీలు, గోపాల్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధి నారాయణపూర్ గ్రామంలో జరిగిన దోపిడీ ఘటనలకు సబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేసి, విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. ఈ క్రమంలో వారి నుంచి రూ.80 వేల నగదు, 15 గ్రాముల బంగారం, 3 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాస బృందావన్ కాలనీకి చెందిన పి.కృష్ణ, బరంపురం లోని గణేష్‌నగర్‌కు చెందిన సాగర్ ముదిలి, నారాయణపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ బెహారాగా గుర్తించామని ఎస్పీ వివరించారు.

ఎమ్మెల్సీ రామారావుకు సత్కారం



కవిటి: ఎమ్మెల్సీ రామారావు దంపతులను సత్కరిస్తున్న యాదవ ఉద్యోగసంఘం నాయకులు

కవిటి: యాదవ సామాజికవర్గం ఉద్యోగుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. యాదవ సామాజికవర్గం జిల్లా ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్సీని కొత్తపుట్టుగలోని తన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సామాజికవర్గాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి నర్తు రామారావుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్తు రామారావు, చామంతి దంపతులను దుశ్శాలువతో సత్కరించారు.

కాశీబుగ్గ: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్తు రామారావును అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి, పలాస–కాశీబుగ్గ మున్సిపల్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఐతి ఈశ్వరరావు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సోంపేట: ఉప్పలాం పంచాయతీ గ్రామస్తులు రామారావును దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్రయాదవ్, సోంపేట జెడ్పీటీసీ సభ్యుడ తడక యశోద, సర్పంచ్ బట్టి మాధవరావు, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, సూరాడ పాపారావు, ఉగ్రపల్లి తిరుపతి, ఎం.రాజు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు జి.సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంపల్లి గ్రామంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ. రెండు లక్షల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ. 60 కోట్లుతో సరిపెట్టడం దారుణమన్నారు. అలాగే రైతులకు ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో, గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం అయ్యిందని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పరిరక్షణ, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కార్మిక చట్టాల కుదింపునకు వ్యతిరేకంగా సీఐటీయూ, కార్మిక, కౌలు రైతు, కార్మిక సంఘాలు కలిసి చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు, కౌలు రైతు సంఘ నాయకులు బమ్మిడి అనందరావు, ప్రజా సంఘాల నాయకులు భాస్కరరావు, నెయ్యిల మోహన్, భానుమతి, ఈశ్వరమ్మ ఉన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రితో విద్యార్థినులు, జై భీమ్‌సేన ప్రతినిధులు

కంచిలి: జాడుపూడిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 38 విద్యార్థినులకు జైభీమ్ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నగిరి మోహనరావు పరీక్ష సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.వాణికుమారి, జైభీమ్ సేన ప్రధాన కార్యదర్శి డి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు బి.ఈశ్వరరావు, సభ్యులు విజయభాస్కర్, తులసయ్య, పాఠశాల సిబ్బంది ఎస్.సుజాత, శ్రీలక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

పొందూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని యురేకా కిడ్స్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. బురిడికంచరాం గ్రామంలో ఏఐడీ ఇండియా అధ్వర్యంలో యురేకా విలేజ్ లైబ్రరీ మేళా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులకు యురేకా వారి ప్రతిభ సర్టిఫికెట్లు, స్టేషనరీ అందించారు. వేణుగోపాలరావు, ఉషారాణి, జి.ఎ.నాయుడు, లక్ష్మీపతి పాల్గొన్నారు.